

ఉచిత పథకాలు ప్రమాదకరం..

బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉచితంగా ఏ పథకం ఇవ్వరాదని, అది పెనుప్రమాదకరమని కాంగ్రెస్ సీనియర్ నేత, పాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్ ఆర్‌వీ దేశ్‌పాండే అన్నారు. ఉత్తరకన్నడ జిల్లా దాండేలి ప్రాంతం అంబేవాడిలో సహాయ ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ్‌పాండే మాట్లాడుతూ ఉచిత పథకాలు ఆర్థిక వ్యవస్థకు కీడు చేస్తాయన్నారు. శక్తి పథక తరహాలోనే పురుషులు కూడా ఉచిత బస్సు ప్రయాణం డిమాండ్ చేస్తున్నారన్నారు.

విశ్వావసు.. దిగ్విజయమస్తు..!

● ఉగాది సంబరాలకు సర్వం సిద్ధం ● కిటకిటలాడిన మార్కెట్లు



బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ఉగాది సంబరాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశ్వావసు నామ సంవత్సరానికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలకడానికి ఇంటింటా ఏర్పాటు చేపట్టారు. బెంగళూరుతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉగాది పండుగను ప్రత్యేకంగా జరుపుకొనే సంప్రదాయం ఉంది. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా షడ్రుచుల ఉగాది పచ్చడి ఆరగించడం సంప్రదాయం. ఉదయం నుంచే అభ్యంగ స్నానాలు చేసి నూతనవస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేయడం ఆనవాయితీ. పూర్వీకులను స్మరించుకుని వారి పేరిట పూజలు చేసే సంప్రదాయం కూడా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఉత్తరకర్ణాటక జిల్లాల్లో ఉగాదికి ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయి. బెంగళూరు, మైసూరు, మండ్య, కోలారు, తుమకూరు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో పంచాంగశ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. తెలుగుతల్లి సంఘం ఆధ్వర్యంలో బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో ఆదివారం సాయంత్రం గ్లోబల్‌స్కూల్ ఆడిటోరియంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా చలసాని విద్యాసంస్థల ఛైర్మన్ చలసాని పూర్ణచంద్రరావు పాల్గొంటున్నారు. ఉగాది పండుగ విశిష్టతను ఇస్కాన్ సంస్థ ఉపాధ్యక్షులు శ్యామ వల్లభదాస వివరించనున్నట్టు తెలిపారు. మైసూరులో తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రామకృష్ణనగర్‌లోని తెలుగు భవనంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నారు. పండుగ సందర్భంగా మార్కెట్‌లు కిటకిటలాడాయి. శనివారం తెల్లవారుజామునుంచే పూలు, పండ్లు కొనుగోళ్లతో కేఆర్ మార్కెట్ మల్లేశ్వరం, జయనగర్, గాంధీబజార్, మడివాళ, ఎలక్ట్రానిక్‌సిటీ, కేఆర్‌పురం మార్కెట్‌లలో సందడి కొనసాగింది. పూలధరలు పెరిగినా పండ్ల ధరలు పర్వాలేదనిపించాయి


కిటకిటలాడుతున్న కేఆర్ మార్కెట్

పండుగవేళ విషాదం నింపిన ప్రమాదాలు

● రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రమాదాలు.. పది మంది దుర్మరణం ● బాగల్కోటెలో బస్సు ఢీ కొని దంపతుల మృతి

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పండగ వేళ రోడ్డు ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో విషాదం నింపాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐదు ప్రమాదాల్లో పదిమంది దుర్మరణం పాలయ్యారు. బెంగళూరులో చెత్త లారీ ఢీ కొని పదేళ్లబాలుడు మృతి చెందగా బాగల్కోటె, చిత్రదుర్గ, ఉడుపి, దావణగెరె జిల్లాల్లో చోటు చేసుకున్న ప్రమాదాలతో కలిపి పదిమంది మృత్యువాత చెందారు.


ముథోళ వద్ద బోల్తా పడిన బస్సు

● బాగల్కోటె జిల్లా ముథోళ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేఎస్ఆర్టీసీ బస్సు బైకును ఢీ కొట్టి అదుపుతప్పి బోల్తా పడింది. బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులు ముగోళకోడ గ్రామానికి చెందిన శంకర లక్ష్మీశ్వర (50), శ్రీదేవి లక్ష్మీశ్వర (40) దుర్మరణం చెందారు. మహాలింగపుర - ముథోళ మార్గంలో మళలి వద్ద శనివారం ప్రమాదం జరిగింది. కొల్హాపుర నుంచి యాదగిరి వైపు బస్సు వెళ్తుండేది, ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టకుండా బస్సు నియంత్రణ చేసేందుకు డ్రైవర్ ప్రయత్నించారు. అయితే బస్సు నేరుగా బైక్‌ను ఢీ కొంది. దీంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. ముథోళ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బెళగావి జిల్లా చిక్కోడి డిపోకు చెందిన బస్సుగా గుర్తించారు.


శంకర లక్ష్మీశ్వర దంపతులు
బాలుడు ఐమాన్ (ఫైల్)

● దావణగెరె, ఉడుపి జిల్లాల పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. దావణగెరె జిల్లా చన్నగిరి తాలూకా బిరూరు పరిధిలో జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అర్జున్ నాయక (25), హరీశ్‌నాయక (31) మృతి చెందారు. ప్రమాదస్థలంలోనే ఇద్దరు దుర్మరణం చెందారు. ఘటనపై చన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇక ఉడుపి జిల్లా బిహెచ్ నుంచి కండ్లూరు వైపు వెళ్తున్న స్కూటీని ఎదురుగా వచ్చిన కారు ఢీ కొనడంతో రాజీవశెట్టి (55), సుధీర దేవాడిగ (35) దుర్మరణం చెందారు. కుందాపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

● చిత్రదుర్గ జిల్లాలో టెంపో ట్రావెలర్ వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. చిత్రదుర్గ జిల్లా చళ్ళకెరె తాలూకా హెగ్గెరె గ్రామంలో ప్రమాదం జరిగింది. మృతి చెందినవారిని శంకరిబాయి (65), కుమారనాయక్ (46), శ్వేత (38)లుగా గుర్తించారు. వాహనం నడిపేటప్పుడు అదుపు తప్పడంతో ప్రమాదం జరిగినట్టు గుర్తించారు. గాయపడినవారిని చిత్రదుర్గ ఆసుపత్రికి తరలించారు.

● బీబీఎంపీ పరిధిలో చెత్తలారీ ఢీ కొని పదేళ్ల బాలుడు మృతి చెందాడు. థణిసంద్ర రైల్వేట్రాక్ వద్ద కుమారుడిని పాఠశాలలో అడ్మిషన్ కోసం తండ్రి బైక్‌పై శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వెళ్తుండగా వేగంగా వచ్చిన చెత్తలారీ ఢీ కొంది. ప్రమాదంలో బాలుడు ఐమాన్ (10) తలపై లారీ దూసుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రికి తీవ్రమైన గాయాలు కాగా అంబేడ్కర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదాన్ని చూసిన స్థానికులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెత్తలారీకి నిప్పు పెట్టారు. డ్రైవర్‌ను చితకబాదారు. హెబ్బాళ ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక యంత్రాలు వచ్చి మంటలను ఆర్పాయి. బెంగళూరు ఉత్తర డీసీపీ సిరిగౌరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆందోళన చేసేందుకు వచ్చినవారిని నియంత్రించడం అంతా సద్దుమణిగింది.

కాంగ్రెస్, జేడీఎస్‌లో చేరేది లేదు

● గౌరవంగా పిలిస్తే బీజేపీలోకి వెళ్తా ● దసరా లోపు తుది నిర్ణయం : యత్నాళ్



బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ నుంచి ఆరేళ్లపాటు సస్పెన్షన్ వేటుకు గురైన బసనగౌడపాటిల్ యత్నాళ్ బెంగళూరులో శనివారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలలో చేరేది లేదని తేల్చిచెప్పారు. బీజేపీలో వంశపారంపర్యం పెరిగిందని, యడియూరప్ప, ఆయన కుమారుడు విజయేంద్ర ఆగడాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు. కాంగ్రెస్, జేడీఎస్ పార్టీల్లో చేరే ఆలోచన లేదన్నారు. నా భవిష్యత్తు నిర్ణయాన్ని దసరావేళ ప్రకటిస్తానన్నారు. యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు శివమొగ్గలో మతఘర్షణలు జరిగితే హిందువులకు మద్దతు ఇవ్వలేదన్నారు. కానీ ఆయన కొడుకు ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడన్నారు. హిందువులకు వాళ్లు ఎప్పుడూ మద్దతుగా నిలబడలేదన్నారు. వారి కుటుంబ అక్రమాలపై నిలదీస్తున్నందుకే తనపై కుట్ర పన్ని సస్పెన్షన్ వేటు వేయించారన్నారు. మళ్లీ బీజేపీలో చేరేందుకు ఎవరినీ బతిమాలేది లేదన్నారు. నేను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. పార్టీకి నిష్ఠావంతుడిని మాత్రమే అన్నారు. క్షమాపణలు కోరినా చెప్పే ప్రసక్తే లేదన్నారు. వాజ్‌పేయ్, ఎల్‌కే అడ్వాణీ వంటి నాయకుల మద్దతుతో ఎదిగానన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంచి నేత అని, అయితే ఆయన చుట్టూ ఉన్నవారు కిందిస్థాయిలోనివారు తీసుకునే నిర్ణయాలు సమంజసంగా లేవన్నారు. రెబెల్స్‌గా మారిన మేమంతా సమైక్యంగా ఉన్నామని, కొందరు ఎంపీలు కూడా తమకు మద్దతు ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు 75శాతం రాష్ట్రనాయకత్వానికి వ్యతిరేకంగా ఉన్నారన్నారు. యడియూరప్ప కుటుంబీకులు పార్టీని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో యడియూరప్ప కొత్త రాజకీయ పార్టీ పెట్టినా మేం బీజేపీ వెంటే నడిచామన్నారు. గౌరవంగా బీజేపీలోకి రావాలని కోరితే కొనసాగుతానన్నారు. విజయదశమి దాకా వేచి చూస్తానన్నారు.

కాగా కలబురగిలో యత్నాళ్ అభిమానులు ఆందోళన చేశారు. యత్నాళ్ సొంత జిల్లా విజయపుర జిల్లా బీజేపీ అధ్యక్షుడు గురులింగప్ప అంగడి యత్నాళ్‌పై మండిపడ్డారు. రానున్న తాలూకా, జిల్లా పంచాయతీ ఎన్నికల విషయమై పార్టీ జిల్లా కోర్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతామని కోర్ కమిటీ సమావేశంలోనూ తీర్మానించామని వెల్లడించారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైలు



గుంతకల్లు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు నరసాపూర్-అరిసికెర-నరసాపూర్ (వయా అనంతపురం) ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07201/02)ను నడపనున్నట్టు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసాపూర్-అరిసికెరె ప్రత్యేక రైలును ఈ ఏప్రిల్ 6, 13, 20, 27, మే 04, 11, 18 25 తేదీల్లో నడపనున్నట్టు తెలియజేశారు. ఈ రైలు పేర్కొన్న తేదీలలో (ఆదివారాలలో) నరసాపూర్‌లో మధ్యాహ్నం 2-20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12-45 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26 తేదీల్లో (సోమవారాలలో) మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1 గంటకు నరసాపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గోవిందవాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపూర్ రోడ్డు, కంబం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపూర్, ధర్మవరం, హిందూపురం, యల్హంక స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

రైలు స్థానాల మార్పు

ధర్మవరం రైల్వే స్టేషన్‌లో నిర్వహణ సమస్యల కారణంగా మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు గమ్యస్థానాన్ని మార్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు. మచిలీపట్నం-ధర్మవరం (నం. 17215) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 31 నుంచి అనంతపురం వరకే గమ్యస్థానాన్ని కుదించినట్టు తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17216)ను ఏప్రిల్ 1 నుంచి మే 1 వరకూ ధర్మవరం నుంచి కాకుండా అనంతపురం నుంచి బయల్దేరుతుందని తెలియజేశారు.

రహదారుల మరమ్మతుకు నిధులు

ఉమ్మడి జిల్లాకు భారీగా మంజూరు

అనంతపురం న్యూటౌన్/పుట్టపర్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్ బీ పరిధిలోని రాష్ట్ర, జిల్లా రహదారుల మరమ్మతుకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిధులు మంజూరు చేసింది. గుత్తి నుంచి పత్తికొండ మీదుగా ఆదోని వెళ్లే రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరు చేసింది. అనంతపురం నుంచి తగరకుంట, అనంతపురం నుంచి రాయచూర్ రోడ్డు మరమ్మతులకు రూ.2.5 కోట్లు ఇచ్చింది. కళ్యాణదుర్గం నుంచి మడకశిర వెళ్లే రోడ్డుకు రూ.4.8 కోట్లు, రాయదుర్గం నుంచి బళ్లారి వెళ్లే రోడ్డుకు రూ.6.2 కోట్లు, ఉరవకొండ-కణేకల్లు రోడ్డుకు రూ.4 కోట్లు మంజూరు చేసింది. రాప్తాడు నియోజకవర్గంలోని దామాజీపల్లి-తాడిపత్రి రోడ్డుకు రూ.కోటి, నాగసముద్రం-పేరూరు రోడ్డుకు రూ.2.5 కోట్లు, పుట్టపర్తి నియోజకవర్గంలోని కోడూరు నుంచి ధర్మవరం వెళ్లే రోడ్డుకు రూ.కోటి మంజూరైంది. ధర్మవరం నుంచి కళ్యాణదుర్గం రోడ్డుకు రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. పెనుకొండ నియోజకవర్గలో బ్రాహ్మణపల్లి, కొల్లకుంట క్రాస్, జూలకుంట, మండ్లి మీదుగా వెళ్లే రహదారి, సోమందేపల్లి నుంచి రాచూరు, అడదాకులపల్లి, ఎల్‌జీపీ నగర్ రాచూరు రహదారులకు రూ.2.10 కోట్లు కేటాయించింది. సోమందేపల్లి మండలం ఆనందపురం సంగమేశ్వరం రాహదారి, బ్రహ్మసముంద్ర మీదుగా కొల్లకుంట, వంగలపల్లి, బీచుగానిపల్లి, ఊటకూరు దాకా రూ.3.20 కోట్లు మంజూరైంది. ధర్మవరం నియోజకవర్గంలోని సంజీవపురం నుంచి వెంటకగిరిపాళ్యం, లింగారెడ్డిపల్లి, ముక్తాపురం, కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, మచ్చురామి రహదారులకు రూ.2.60 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. మడకశిర నియోజకవర్గంలో మధూడి, రామాపురం, బందర్లపల్లి, ఆర్‌జే రోడ్, జీఎస్ తండా, హెచ్‌ఆర్ హట్టి, పి.గొల్లహట్టి, అగళి, బొమ్మరాసనపల్లి, కొండేపల్లి రహదారికి రూ.2.62 కోట్లు ఇచ్చింది. కదిరి నియోజక వర్గంలో తిమ్మమ్మమర్రిమాను అనుసంధానం రహదారికి రూ.20 లక్షలు ఇచ్చింది. హిందూపురంలో కొండికొండ రాష్ట్ర సరిహద్దు, సోమందేపల్లి నుంచి ఎల్‌జీపీ నగర్ దాకా మరమ్మతులకు రూ.2.50 కోట్లు ఇచ్చారు. నాగసముంద్ర నుంచి పేరూరు దాకా రహదారికి రూ.2.50 కోట్లు, దామాజీపల్లి నుంచి తాడిపత్రి రహదారికి రూ.కోటి, ధర్మవరం, కళ్యాణదుర్గం రహదారికి రూ.50 లక్షలు మంజూరైంది.



టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

తెలుగువారి కీర్తి పతాక.. టీడీపీ

ఆవిర్భావ సభలో పార్టీ నాయకులు

వాడవాడలా ఎగిరిన పసుపు జెండా

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలు

అనంతపురం అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కీర్తి పతాక తెలుగుదేశం అని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పసుపు జెండాను ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

- అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో, జడ్పీ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు.
- టీడీపీ ఆవిర్భావంతోనే ఏపీకి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ జెండా ఆవిష్కరించారు.
- తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ పేదల కోసం స్థాపించారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడులోని పార్టీ కార్యాలయంలో పసుపు జెండాను ఎగురవేశారు.
- పేదరికాన్ని రూపుమాపడమే టీడీపీ లక్ష్యమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.
- రాయదుర్గంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఎంపిక చేసిన పార్టీ సీనియర్ నాయకులను సత్కరించారు.
- పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ బీకే పార్థసారథి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను సన్మానించారు.
- తాడిపత్రి పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.
- బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలో పార్టీ జెండాను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని అన్నారు.
- మడకశిర ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.
- కదిరి మున్సిపల్ కార్యాలయంలో వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంపట్రసాద్ పూలమాల వేసి నివాళి అర్పించారు.
- పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు.
- ధర్మవరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత



రాయదుర్గంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెనుకొండలో టీడీపీ సీనియర్ నాయకులను సన్మానిస్తున్న బీకే పార్థసారథి



తాడిపత్రిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



నీలారెడ్డిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ నాయకులు



కళ్యాణదుర్గంలోని ప్రజావేదిక వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



మడకశిరలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల



కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట



పుట్టపర్తి లో పార్టీ ఆవిర్భావ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె



ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న పరిటాలశ్రీరామ్

అనంత వాసులకు ఉగాది పురస్కారాలు

ప్రభాకర్ చౌదరికి కళారత్న అవార్డు



ప్రభాకర్ చౌదరి, ఉమ్మడిశెట్టి రాధేయ, పూర్ణచంద్రశేఖర్, గురుమూర్తి గుప్త

అనంతపురం కల్చరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాల్లో నలుగురు అనంత వాసులకు చోటు దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా 86 మందిని కళారత్న అవార్డులకు ఎంపిక చేయగా.. సామాజిక సేవల విభాగంలో అవే సంస్థ వ్యవస్థాపకుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి కళారత్న(హంస) అవార్డుకు ఎంపికయ్యారు. 116 మందిని ఉగాది పురస్కారాలకు ఎంపిక చేయగా అనంతపురం జిల్లా నుంచి సాహిత్య విభాగంలో ఉమ్మడిశెట్టి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ, వాస్తు జ్యోతిష్య పండితుడు చిత్రాల గురుమూర్తి గుప్త, రంగస్థల నాటకం విభాగంలో సురభి వనరస పూర్ణచంద్ర శేఖర్ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉగాది సంబరాల్లో వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందజేసి సత్కరించనున్నారు.

మైనాస్వామికి ఉగాది పురస్కారం



గోరంట్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చారిత్రక పరిశోధకుడు మైనాస్వామికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. చారిత్రక పరిశోధన, శాసన పరిశోధనలో ఆయన చేసిన విశేష కృషిని ప్రభుత్వం గుర్తించి, పురస్కారాన్ని ప్రకటించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే ఉగాది వేడుకలలో ఆయన పురస్కారాన్ని అందుకుంటారని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జున తెలిపారు.

తాడిపత్రికి రావద్దని ఆంక్షలు సరికాదు

ఎస్పీని కలిసిన వైసీపీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలో జరుగుతున్న పరిణామాలపై వైసీపీ నేతలు శనివారం ఎస్పీ జగదీష్‌ను కలిశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజమ్, నగర మేయర్ మహమ్మద్ వసీం, కౌన్సిలర్ ఫయాజ్ బాషా తదితరులు ఎస్పీని కలిశారు. ఇటీవల తాడిపత్రిలో మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటిపై జేసీ వర్గీయుల దాడిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాడిపత్రిలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యాలు తీవ్రమయ్యాయని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక అటవిక రాజ్యం ఏర్పడిందన్నారు. వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి దాడి చేస్తే ఫయాజ్‌బాషాపై కేసు నమోదు చేయటం దారుణం అన్నారు. తాడిపత్రిలో ఉండొద్దంటూ ఆంక్షలు విధించటం సరికాదన్నారు. ఫయాజ్‌బాషాకు భద్రత కల్పించి తాడిపత్రికి పంపుతామని ఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు. ఇఫ్తార్ విందు ఇస్తానని ఫయాజ్‌బాషా ప్రకటించాకే జేసీ వర్గీయులు దాడి చేశారని వివరించారు. ఫయాజ్ ఇఫ్తార్ విందు ఇస్తే జేసీకి సమస్య ఏంటి అని ప్రశ్నించారు. తాడిపత్రితో టీడీపీ దౌర్జన్యాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫయాజ్‌బాషా మాట్లాడుతూ... జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై కక్షసాధింపుతో వ్యవహరిస్తున్నారని అన్నారు. పోలీసుల సమక్షంలోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి రాళ్లతో దాడులు చేయించారని ఆరోపించారు. ఆయన నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

నేడు, రేపు పన్నుల చెల్లింపునకు అవకాశం

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో వార్షిక సంవత్సరం చివరి రోజు సెలవులు ఉన్నా, ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించడానికి అవకాశం కల్పించామని ఆ శాఖ జిల్లా జాయింట్ కమిషనర్ శేషాద్రి శనివారం తెలిపారు. ఆదివారం, సోమవారం ఉగాది, రంజాన్ పండుగలున్నా, పన్నుదారులు జిల్లా కేంద్రంలో పన్నుల శాఖ కార్యాలయంలో పన్ను చెల్లించవచ్చని తెపాఆరు. సిబ్బంది పరిమితంగా అందుబాటులో ఉంటారని అన్నారు. అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ అందుబాటులో ఉంటారని, ఏమైనా సందేహాలుంటే సమాధానం ఇస్తారని తెలిపారు.

13న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

అనంతపురంరూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్‌మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహిస్తున్న కురుగుంట కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి తెలిపారు. ఆమేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి ఏప్రిల్ 6న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు.

రేపటి వరకే తొలివిడత

ఉచిత సిలిండర్‌కు చివరి అవకాశం

జిల్లాలో 5,05,831 మంది అర్హులు

ఇప్పటి వరకు 4,17,502 మంది వినియోగం

ఖాతాల్లోకి రూ.33.52 కోట్లు జమ

ఇంకా 88,329 మంది దూరం



అనంతపురం టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న గ్యాస్ సిలిండర్ల మొదటి విడతకు సోమవారంతో గడువు ముగుస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. నాలుగు నెలలకు ఒక ఉచిత సిలిండర్ ఇవ్వడానికి ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. గతేడాది డిసెంబరులో ఉచిత సిలిండర్లు పంపిణీకి శ్రీకారం చుట్టారు. గ్యాస్ బుక్ చేసుకుని సిలిండర్‌ను పంపిణీ చేసిన 24 గంటల్లో తిరిగి వారిఖాతాల్లోకి ఆ సొమ్మును ప్రభుత్వం జమచేస్తూ వస్తోంది. డిసెంబరు నుంచి మార్చి 31వ తేదీ వరకు తొలి ఉచిత సిలిండర్‌కు అవకాశం ఇచ్చారు.

4,17,502 మందికి రూ. 33.52 కోట్లు జమ

అనంతపురం జిల్లాలో అధికారిక లెక్కల మేరకు 6,66,330 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో నిబంధనల మేరకు 5,05,831 మందిని ఉచిత వంటగ్యాస్ పొందడానికి అర్హులుగా గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 4,17,502 మంది తొలి సిలిండర్‌ను బుక్‌చేసుకొని వినియోగించుకున్నారు. వీరందరికి ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌కు రూ.869 చొప్పున వారి ఖాతాల్లోకి జమచేసింది. ఇప్పటి వరకు మొత్తం రూ. 33,52,70,710 జమచేసింది.

88,329 మంది దూరం..

ఉచిత తొలి సిలిండర్ పొందడానికి సోమవారం వరకు మాత్రమే అవకాశం ఉంది. అధికారుల రికార్డుల మేరకు ఇంకా జిల్లాలో 88,329 మంది అర్హత ఉన్నా ఉచిత సిలిండర్ తీసుకోలేదు. వీరందరు తొలి ఉచిత గ్యాస్‌సిలిండర్ పొందాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు ఈనెల 31వతేదీలోగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

రేపే చివరి రోజు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్చి 31వ తేదీ వరకు ఉచిత గ్యాస్‌సిలిండర్ పొందడానికి అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో ఇంకా 88,329 మందికి తొలిసిలిండర్ పొందడానికి అర్హత ఉంది. వీళ్లందరు సోమవారం లోపు తప్పనిసరిగా బుక్ చేసుకోవాలి. అప్పుడే ప్రభుత్వం ఆ డబ్బును వారి ఖాతాల్లోకి జమచేస్తుంది. తర్వాత బుక్‌చేసుకుంటే తొలి ఉచిత సిలిండర్ వారికి వర్తించదు. రెండో సిలిండర్‌కు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

- జగన్నాథ్‌రావు, ఇన్‌చార్జ్ డీఎస్ఓ

మండుతున్న ఎండ

సాధారణం కంటే 2-3 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రత

బొమ్మనహాల్‌లో 42.29డిగ్రీలు సెల్సియస్ నమోదు

రాబోయే రోజుల్లో మరింత వేసవి తాపం

బుక్కరాయసముద్రం మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలతో జనాలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 8గంటలకే ఎండల తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 6గంటల వరకు తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు సెల్సియస్ ఎక్కువగా నమోదవుతున్నాయి. రానున్న ఏప్రిల్, మే మాసాలలో ఎండలు మరింత పెరగనున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. జిల్లాలో మార్చి చివరి వారం, ఏప్రిల్ మొదటి వారాల్లో సాధారణంగా 38-39.5 డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవ్వాలి. అయితే శనివారం బొమ్మనహాళ్‌లో 42.29 డిగ్రీలు సెల్సియస్ నమోదయ్యింది. రాత్రి సమయంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 20-21 డిగ్రీలు ఉండాలి. అలాంటిది 24 డిగ్రీలు సెల్సియస్ నమోదువుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో ఉక్కపోత బాగా పెరి గింది. ఉదయం 9 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడే పరిస్థితి. మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.



ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

బయటకు వెళితే ఎండ. ఇంట్లో ఉంటే ఉక్కపోత. దీంతో ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఉష్ణోగ్రతలు అత్యధికస్థాయికి చేరుకోవడంతో ఫ్యాన్లు, కూలర్లు కూడా సరిపోవడం లేదు. బయటకు వచ్చిన సమయంలో గొడుగులు, టవళ్లు, టోపీలతో ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఎండ, వడగాడ్పుల తీవ్రత కు వడదెబ్బ తగిలే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, బయటకు వెళ్లవద్దని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

- అనంతపురం జిల్లాలో... అత్యధికంగా బొమ్మనహాళ్ 42.29, గుంతకల్లు 42.03, యల్లనూరు41.11, విడపనకల్లు41, శింగనమల 40.9 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యాయి.
- శ్రీ సత్యసాయి జిల్లాలో... కొత్తచెరువులో 41.2, సీకేపల్లి 41.2 తాడిమర్రి 41.1, ముదిగుబ్బ 41. కనగానపల్లి 40.07 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యాయి.

నెలాఖరులోపు పన్ను వసూలు: డీపీఓ



ఇంటర్వ్యూ interview

అనంతపురం న్యూటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. పంచాయతీల్లో పన్ను వసూళ్లు, సిబ్బంది పనితీరు, పారిశుధ్యం తదితర అంశాలపై ఆయన వివరించారు.

ప్రశ్న: పన్ను వసూళ్లపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీపీఓ: జిల్లాలోని 31 మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో నెలాఖరులోపు వందశాతం పన్ను వసూలు చేయాల్సిందే. ఇప్పటికే కొన్ని చిన్న పంచాయతీల్లో 90 శాతం వరకు టార్గెట్ పూర్తి చేశాం. కొన్ని మేజర్ పంచాయితీల్లో డిమాండ్ ఎక్కువ ఉండటం, సిబ్బందికి ఇతర అదనపు పనులు ఉండటం వల్ల కొంత వెనుకబడి ఉన్నారు.

ప్రశ్న: విధులకు డుమ్మా కొట్టేవారిపై ఎలాంటి చర్యలు చేపడతారు?

డీపీఓ: పలు పంచాయితీల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. అందుకు ప్రధాన సాక్ష్యం బయోమెట్రిక్ హాజరే. అందులో నిర్లక్ష్యం వహించిన వారికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారి చేసి వివరణ కోరాం. రిపీట్ అయితే క్రమశిక్షణ చర్యలు తప్పవు.

ప్రశ్న: పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీపీఓ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పూర్తి స్థాయిలో మెరుగుపడాలి. ప్రత్యేక నిఘా ఉంచి మెరుగుకు తగిన చర్యలు చేపడతాం. కార్యదర్శులకు, ఈఓఆర్డీలకు పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించాం.

ప్రశ్న: కార్యదర్శులపై ఉన్న పని ఒత్తిడికి ప్రత్యామ్నాయ చర్యలు ఏవి?

డీపీఓ: పంచాయతీల్లో ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ అమలుతో సిబ్బంది పెరిగినప్పటికి కార్యదర్శులకు మాత్రం పని ఒత్తిడి అయితే పెరిగింది. అయితే అందుకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేసుకొని ఒత్తిడి తగ్గించుకొనేలా క్షేత్రస్థాయిలో కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏ విభాగానికి సంబంధించిన సర్వే ఆ విభాగ సిబ్బంది ద్వారా చేయిస్తే కార్యదర్శులు వారు చేయాల్సిన ట్యాక్స్ కలెక్షన్స్, పారిశుధ్యంపై దృష్టి సారించే అవకాశం ఉంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంఫ్...

దేవికారాణి (జయంతి)



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు తొలి గ్రహీత దేవికారాణి 1908 మార్చి 30న విశాఖపట్నం సమీపాన వాల్తేరులో జన్మించారు. పూర్తి పేరు దేవికా రాణి చౌదరి. ఈమె తండ్రి భారత దేశపు తొలి సర్జన్ జనరల్ కల్నల్ ఎంఎన్ చౌదరి. ఆమె జర్మనీకి చెందిన సినీ నిర్మాత హిమాంశు రాయ్‌ను పెళ్లి చేసుకున్నారు. సొంతంగా 'కర్మ' అనే చిత్రాన్ని నిర్మించి హీరో, హీరోయిన్‌లుగా హిందీలోకి అనువదించి విడుదల చేయగా ఘన విజయం సాధించింది. బాంబే టాకీస్ ద్వారా వర్ధమాన కళా కారులను ప్రోత్సహించారు. దేవికారాణి, అశోక్ కుమార్‌ల జంట హిట్‌పెయిర్‌గా నిలిచింది. టెక్స్‌టైల్ డిజైనర్‌గా, గాయనిగాను ప్రతిభ చాటుకున్నారు. 1940లో హిమాంశు మరణానంతరం రష్యన్ చిత్ర కారుడు రోరిచ్‌ను వివాహం చేసుకున్నారు. సినీ రం గంలో సేవలకు 1958లో పద్మశ్రీ పురస్కారం అందు కున్నారు. 1994 మార్చి 9న బెంగళూరులో కన్నుమూశారు.

ఇంగ్‌వర్ కాంప్రాడ్ (జయంతి)



అంతర్జాతీయంగా పేరొందిన (ఐకెఇఎ) 'ఐకియా' సంస్థ సంస్థాపకుడు ఫియోడర్ ఇంగ్‌వర్ కాంప్రాడ్ 1926 మార్చి 30న జన్మించారు. స్వీడిష్ దేశానికి చెందిన వ్యాపారదిగ్గజం. ఫర్నీచర్ రంగంలో విప్లవాత్మక మార్పులు సాధించారు. తన జీవితంలోని ఒడిదుడుకులు, విజయాలతో కూడిన 'ఏ టెస్టిమెంట్ ఆఫ్ ఏ ఫర్నీచర్ డీలర్' పుస్తకాన్ని రచించారు. అదే విధంగా 'లీడింగ్ బై డిజైన్ : ది ఐకియా స్టోరీ' ఆటో బయోగ్రఫీని రాశారు. 2018 జనవరి 27న కన్నుమూశారు.

ఏకేసీ నటరాజన్ (పుట్టినరోజు)



కర్ణాటక సంగీత క్లారినెట్ విద్వాంసుడు ఆంజల కుప్పుస్వామి చిన్నికృష్ణ (ఏకేసీ) నటరాజన్ 1931 మార్చి 30న తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి (తిరుచ్చి)లో జన్మించారు. గాత్రసంగీతాన్ని అలత్తూరు వెంకటేశ అయ్యర్ వద్ద, నాదస్వరాన్ని ఇలుప్పూర్ నటేశపిళ్లై వద్ద నేర్చుకున్నారు. నాదస్వర పండితుడు టీఎన్ రాజరత్నం పిళ్ళై ఇతడిని 'క్లారినెట్ ఎవరెస్ట్'గా అభివర్ణించారు. 2022లో 'పద్మశ్రీ' పురస్కారం, ఇంకా సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డు, నాదద్వీప కళానిధి తదితర పురస్కారాలు పొందారు. ఆకాశవాణి నిలయ విద్వాంసుడిగా పలు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

నోరా జోన్స్ (పుట్టినరోజు)



నోరా జోన్స్‌గా చిరపరిచితురాలైన గీతాలి నోరా జోన్స్ శంకర్ 1979 మార్చి 30న న్యూయార్క్‌లో జన్మించారు. సితార్ మేస్ట్రో పండిట్ రవిశంకర్ కుమార్తె. ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకు 50 మిలియన్ రికార్డ్స్ అమ్ముడయ్యాయి. అమెరికాలో గాయనిగా, గీత రచయితగా, నటిగా, పియానో కళాకారిణిగా పేరొందారు. 'కమ్ అవే విత్ మి' ఆల్బమ్ ప్రపంచ వ్యాప్తంగా 27మిలియన్ కాపీలు అమ్ముడైంది. 9 గ్రామీ అవార్డులు అందుకున్నారు. బిల్‌బోర్డ్ పత్రిక 2000లో ఆమెను టాప్ జాజ్ ఆర్టిస్ట్‌గా అభివర్ణించింది.

అప్రమత్తత అవసరం

మహదేవపుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో శ్వాసకోశ సమస్యలు, నరాల సమస్యలు, కిడ్నీ వైఫల్యం వంటి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని సరైన సమయంలో చికిత్సలు పొందితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునని ఓవం ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఆదర్శ్ అభిప్రాయపడ్డారు. హొరమావు ప్రాంతం కల్యాణనగర్‌లోని పిపిసీయూ, ఐవిఎఫ్ విభాగం ప్రారంభంలో ఆయన మాట్లాడుతూ పిల్లల్లో విభిన్న సమస్యలు తలెత్తుతున్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్యాణనగర్ చుట్టుపక్కల సుమారు 30మంది పీడియాట్రిషన్‌లు ఉన్నారంటూ పిల్లల్లో ఏదైనా సమస్య తలెత్తితే తమ ఆసుపత్రిలో అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. కామిని ఆసుపత్రి సంస్థాపకులు డాక్టర్ కామిని ఏ రావ్ మాట్లాడుతూ ఇటీవల సుమారు 20శాతం సంతానలేమి సమస్యలు ఉన్నాయని, పెళ్లిళ్ల ఆలస్యం కావడం, పిల్లలకోసం వాయిదా వేయడం వంటివి కొన్ని కారణాలుగా ఉన్నాయన్నారు. ఓవం ఆసుపత్రిలో అత్యున్నత ప్రమాణాలతో ఐవిఎఫ్ విభాగం ఉందన్నారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్ డైరెక్టర్ డాక్టర్ చైత్ర, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ సాయిశంకర్, డాక్టర్ హరిణి పి శెట్టి, డాక్టర్ భాస్కర్ షెట్టి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆస్టిన్ మార్టిన్ కారు


బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆస్టిన్ మార్టిన్ కంపెనీ వాన్‌ఫిష్ బోల్డ్ డిజైన్ కారును బెంగళూరులో శనివారం ఆవిష్కరించారు. ప్రపంచంలోనే విలాసవంతమైన కార్లలో ఒక్కటైన ఆస్టిన్‌మార్టిన్ వి-12తో కొత్త ఫీచర్లతో వచ్చిందని సేల్స్ విభాగం జనరల్ మేనేజర్ గౌతందత్తా ప్రకటించారు. 2024లో ప్రపంచవ్యాప్తంగా వెయ్యి యూనిట్లను తయారు చేశామన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో షోరూం కలిగి ఉన్నామన్నారు. కాస్మోపాలిటన్ నగరమైనందున బెంగళూరులో ఆవిష్కరించామన్నారు.

హత్యకేసు నిందితుడి అరెస్టు

బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కుటుంబ సభ్యులు నలుగురిని హతమార్చిన కేసులో నిందితుడు గిరీశ్ (38)ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం కొడగు జిల్లా పొన్నంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బేగూరు గ్రామం బాళంగాడు ప్రదేశంలో నలుగురిని హతమార్చిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడు గిరీశ్‌ను అరెస్టు చేశారు. హత్యకు గురైనవారు సంచారజాతి తెగకు చెందినవారు. నాగికు గిరీశ్ మూడో భర్త. కొంతకాలం అన్యోన్యంగా ఉన్నా ఇటీవల నాగితో రెండోభర్త సుబ్రమణియన్ సన్నిహితంగా ఉన్నారనే విషయమై గొడవల నేపథ్యంలో నలుగురిని హతమార్చాడు.

బ్రాండ్ బెంగళూరు దిశగా బీబీఎంపీ బడ్జెట్

» రూ.19వేల కోట్లు దాటిన వైనం - మౌలిక వసతులకు ప్రాధాన్యం



బడ్జెట్ బ్యాగులతో బీబీఎంపీ కమిషనర్‌లు

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవ్యాప్తంగా పేరొందుతున్న నగరానికి 'బ్రాండ్ బెంగళూరు' చేయాలని భావించింది. ఆ దిశగానే బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) బడ్జెట్ సాగింది. శనివారం టౌన్‌హాల్‌లో బీబీఎంపీ స్పెషల్ కమిషనర్ ఉమా శంకర్, చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్‌ల సమక్షంలో ఫైనాన్స్ విభాగం కమిషనర్ హరీశ్‌కుమార్‌లు 2025-26వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.19,930.64 కోట్ల ఆదాయం అంచనాలతో 19,927.08 కోట్ల ఖర్చుగా రూ.3.56 కోట్ల మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

ఆసుపత్రులలో పడకల సామర్థ్యం పెంపు

బ్రాండ్ బెంగళూరు పథకంలో భాగంగా రూ.413 కోట్లతో 19 ఆసు పత్రులలో 852 పడకలనుంచి 1122 కు పెంచదలిచారు. రోగనిర్ధారణకు 60కుపైగా ఉచిత ల్యాబ్‌లను 26 దంతచికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయదలిచారు. పాఠశాల విద్యార్థులకు ఏఐ ఆధారిత రిఫ్రాక్టోమీటర్‌ల ద్వారా పరీక్షలు చేస్తారు.

ప్రధాన వనరులు ఇవే...

రెవెన్యూ ద్వారా ఆదాయం పెంచుకోదలిచారు. 7లక్షల ప్రాపర్టీలతో అవుట్ సైడ్ నెట్‌వర్క్ నుంచి పన్నుల పరిధిలోకి తీసుకురాదలిచామన్నారు. ఈ ఏడాది 5,716 కోట్ల రూపాయలు పన్నుల రూపంలో ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బకాయిలతోపాటు కొత్త పన్నులను పెంచదలిచారు. 2024 ఫిబ్రవరి నుంచి నవంబరు దాకా 3లక్షల ఆస్తుల బకాయిలను రూ.1270 కోట్లు వసూలు చేసినట్టు తెలిపారు. పాలికె పరిధిలో 25లక్షల ఖాతాలను ఆన్‌లైన్ ద్వారా డిజిటలీకరణ చేస్తున్నామన్నారు. జీఐఎస్ ఆధారిత ఇ-ఖాతా వ్యవస్థను కొనసాగించదలిచామన్నారు. పన్నుల ద్వారా రూ. 750 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. నగర యోజనలో భాగంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, కాలుష్య నియంత్రణ మండలి, బెస్కాం, జలమండలి, హెచ్‌ఏఎల్, జక్కూరు ఫ్లైయింగ్ స్కూల్, అగ్నిమాపకశాఖ కేంద్రాల సహకారంతో ఆన్‌లైన్ ద్వారా భవనాలపై సర్వే కొనసాగిస్తున్నామన్నారు.

పౌరకార్మికులు, దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం

12,692 మంది పౌరకార్మికులను రెగ్యులర్ చేసి వారి వేతనాలు, భత్యాల కోసం రూ.500 కోట్లు కేటాయించామన్నారు. మహిళల అభివృద్ధిలో భాగంగా ఇ-సారథి అమలుకు రూ.10కోట్లు, అన్ని డివిజన్‌లలోనూ వెయ్యిమంది అర్హులైన మహిళలు, పౌరకార్మికులకు ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనాలను, దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్ల పంపిణీకి రూ.15కోట్లు కేటాయించారు. తృతీయలింగ విభాగానికి చెందినవారికి వెనుకబడినవర్గాలకు పెట్టుబడులలో 50శాతం లేదా రూ.2లక్షల సహాయధనాన్ని 500మందికి కేటాయించ దలిచామన్నారు. నగరంలో 2500మంది అర్హులైనవారికి సొంతింటికల సాకారం చేయదలిచామని ఈ ఏడాది వెయ్యిమందికి జీవనోపాధికోసం కుట్టుమిషన్లు ఇవ్వదలిచామన్నారు. గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను సమకూర్చేందుకు కోటి రూపాయలు కేటాయించారు. సీనియర్ సిటిజన్లకు అవసరమైన వస్తువులకోసం రూ.2కోట్లు, యువత నైపుణ్యాభివృద్ధికి రూ.5కోట్లు, వీధి వ్యాపారుల సంక్షేమానికి రూ.10కోట్లు, అనాథల వసతి కేంద్రాలకు రూ.5కోట్లు కేటాయించారు. పాలికెలో కొనసాగే అభివృద్ధి కార్యక్రమాలను సోషల్‌మీడియా ద్వారా ప్రచారానికి ఇ-మ్యాగజైన్ వినియోగించనున్నట్టు వివరించారు.

సంచారానికి భారీగా నిధులు

బ్రాండ్ బెంగళూరులో భాగంగా సులభతర సంచారం కోసం రూ.890కోట్లు కేటాయించారు. నగరంలో సొరంగమార్గాలకు రూ.42వేల కోట్లు అంచనా వేశారు. ఎలివేటెడ్ కారిడార్, గ్రేడ్ సెపరేటర్ నిర్మాణాలకు రూ.13,200 కోట్లు, మెట్రో, ఫ్లై ఓవర్‌లు, డబుల్‌డెక్కర్‌ల నిర్మాణానికి రూ.9వేలకోట్లు, రాజ కాలువల పరిధిలో రోడ్ల నిర్మాణానికి రూ.3వేలకోట్లు, వైట్‌ట్యాపింగ్ నిర్మాణాలకు రూ.6వేల కోట్లు, స్కైడెక్ నిర్మాణానికి రూ.400కోట్లు ఖర్చు చేయదలిచామన్నారు. స్వచ్ఛ బెంగళూరులో భాగంగా నగరానికి నాలుగువైపులా వంద ఎకరాల విస్తీర్ణంలో చెత్త సంస్కరణ కేంద్రాలు ఏర్పాటు చేయ దలిచామన్నారు. హసిరు బెంగళూరులో భాగంగా కార్పొరేట్ సంస్థల సీఎస్‌ఆర్ నిధులతో 5లక్షల మొక్కలు నాటడంతోపాటు అటవీప్రాంత అభివృద్ధికి 51.69 కోట్ల రూపాయలు ఖర్చు చేయదలిచారు. పాలికె పరిధిలోని 75వేల కుక్కలకు సంతానహరణ చికిత్సలు జరిపించామన్నారు. 6 డివిజన్లలో పశువైద్య కేంద్రాలను ప్రారంభించదలిచారు. వీధికుక్కలకు మైక్రోచిప్ అమర్చే పైలట్ ప్రాజెక్టు కోసం రూ.60కోట్లు కేటాయించారు. 5 కోట్లతో కసాయిఖానా నిర్మించదలిచారు.

అన్నిరంగాలకు సముచితంగా.

బ్రాండ్‌బెంగళూరు విద్యావ్యవస్థలో భాగంగా 15 కొత్త పాఠశాలలకు భవనాలు, 16 పాఠశాల భవనాలను నిర్మించదలిచారు. వివిధ భాషలలో మాట్లాడే పిల్లల సామర్థ్యం పెంచేందుకు విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించదలిచారు. పాఠశాల భవనాల నిర్వహణకు రూ.23.34 కోట్లు, మైదానాల అభివృద్ధికి 30కోట్లు, విద్యాకార్యక్రమాలకు 120.35 కోట్లు ఖర్చు చేయదలిచారు. జలసంరక్షణకోసం రూ.210 కోట్లతో పలు పనులు చేపట్టదలిచారు. టెక్ బెంగళూరులో భాగంగా 40కోట్ల రూపాయలతో వెబ్‌పోర్టల్ ద్వారానే అన్ని సేవలు కొనసాగించదలిచారు. వైబ్రంట్ బెంగళూరులో భాగంగా రూ.50కోట్లతో సుందరంగా దీపాలంకరణ, బహిరంగ ప్రదేశాలలో సుందరీకరణకు రూ.25కోట్లు స్కైడెక్ నిర్మాణానికి రూ.50కోట్లు ఖర్చు చేయదలిచారు. ఏడాదిపాటు ఉద్యానవనాలలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగిం చదలిచారు. బెంగళూరు అభివృద్ధికి కట్టుబడ్డామని ఆ దిశగానే బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు కమిషర్ తుషార్ గిరినాథ్ ప్రకటించారు. గ్రేటర్ బెంగళూరుపై వ్యతిరేకతతో సంబంధం లేదని, సమగ్ర బెంగళూరు అభివృద్ధి దిశగా బడ్జెట్‌లో అన్నింటికీ ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మొత్తంగా గత ఏడాదితో పోల్చితే బడ్జెట్‌గాత్రం పెరిగింది. కాగా బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ నాగరాజ్‌యాదవ్ పాల్గొనగా బడ్జెట్ ముగిశాక కమిషనర్‌లు మీడియాతో మాట్లాడుతున్నప్పుడు బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న బడ్జెట్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు.

1నుంచి అనంత విశ్వకల్యాణ మహాయజ్ఞం

దొమ్మసంద్ర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా నెరిగా గ్రామ పంచాయతీ పరిధిలోని నక్కుంది దొమ్మసంద్ర గ్రామంలో అలిమేలు మంగసమేత శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించి లోకకల్యాణార్థం అనంత విశ్వకల్యాణ మహాయజ్ఞం ఏప్రిల్ 1నుంచి 13వరకు జరగనుంది. గోపూజ, అష్టాష్టరీ హోమం, వివిధ హోమాలు, విష్ణుసహస్రనామ పారాయణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాసోహం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులలో ఒకరైన రామమూర్తి తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించి గ్రామస్థులతో కలసి శ్రీనాథ్‌స్వామిజీ మీడియాతో మాట్లాడుతూ పూర్వీకులైన రుషులకాలంలో యజ్ఞయాగాదులను క్రమం తప్పక నిర్వహించేవారన్నారు. ఇదే స్ఫూర్తితో కొనసాగించదలిచామన్నారు. ప్రత్యేకించి పది ఎకరాలలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. 16 కుటీరాలను, 108 హోమగుండంలు ఏకకాలంలో పలు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.



నక్కుంది దొమ్మసంద్ర గ్రామస్థులతో స్థానిక ప్రముఖులు

పీఈఎస్ స్టార్టప్ పాకెట్ కోచ్‌కు 30లక్షల గ్రాంట్



జట్టును అభినందిస్తున్న మంత్రి ప్రియాంక ఖర్గే

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీలో ప్రారంభించిన స్టార్టప్ పాకెట్‌కోచ్ జట్టు 'స్టార్టప్ కర్ణాటక ఎలివేట్ 2024'లో విజేతగా నిలిచింది. ప్రభుత్వం నుంచి 30లక్షల నగదు బహుమతిని ఐటీబీటీశాఖ మంత్రి ప్రియాంకఖర్గే విద్యార్థులకు ప్రదానం చేశారు. యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగంలో పాకెట్‌కోచ్ బృందం ప్రత్యేక ప్రతిభను కనబరిచింది. క్రీడాటెక్ స్టార్టప్ పరిణామం క్రీడాకారుల నైపుణ్యతకు విప్లవాత్మకమైన మార్పు సామర్థ్యాన్ని స్టార్టప్ హైలెట్ చేస్తోంది. పాకెట్‌కోచ్ బృందానికి ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే షీల్డుతోపాటు నగదు బహుమతిని ప్రదానం చేశారు. పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీ జవహర్ పాకెట్ కోచ్ స్టార్టప్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు



యలహంకలో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో అభిమానులు

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో జరిపారు. బెళ్ళందూరులోని పార్టీ కార్యాలయంలో ముఖ్యులు సోంపల్లి శ్రీకాంత్, పవన్ మోటుపల్లి, సురేశ్, వెంకి, రాజు తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. ఇదే సందర్భంగా సోంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతోమంది బలహీనవర్గాలకు రాజకీయాల్లో ఉన్నత పదవులు వరించాయన్నారు. పార్టీ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. బెంగళూరు టీడీపీ ఫోరం 12 సంవత్సరాలుగా పార్టీకోసం సేవలందిస్తోందన్నారు. కార్యక్రమంలో పాండు, ప్రసాద్, ప్రతీశ్, సాయిరమేశ్, రామాంజి తదితరులు పాల్గొన్నారు. పార్టీ ప్రయోజనాలకోసం నిరంతరంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

యలహంకలో...

టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని యలహంకలో జరిపారు. దేవాంగం పాపన్న, రెడ్డెప్ప, పురుషోత్తమ్, చన్నకేశవ, జయరాములు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్, చంద్రబాబు, నారా లోకేశ్ జిందాబాద్ అంటూ వేడుకలు చేసుకున్నారు. ఉత్తప్ప, నాగార్జున, రామాంజి, మీసాలప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



టీడీపీ ఫోరం కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం పెరగాలి



ప్రసవాలకోసం ప్రత్యేక టబ్ వివరాలు తెల్పుతున్న డాక్టర్ శిరీషారెడ్డి

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సాధారణ ప్రసవాలు పెరగాల్సిన అవసరం ఉందని, పాశ్చాత్య దేశాలకంటే మనదేశంలోనే ఎక్కువ సిజేరియన్‌లు జరుగుతున్నాయని ప్రముఖ గైనకాలజిస్ట్ శిరీషారెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రాచీన విధానమైన నీటిలో ప్రసవం విధానాన్ని బెంగళూరు మదర్‌హుడ్ ఆసుపత్రిలో ప్రారంభించినట్టు తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయం, ఆహార వ్యవహారాలకు అనుగుణంగా శతాబ్దాల కాలంగా సహజకాన్పులు జరిగేవన్నారు. ఒకప్పుడు ఇళ్లలోనే ప్రసవాలు కొనసాగేవన్నారు. ప్రాచీన కాలంలో నీటిలో ప్రసవాలు జరిపేవారన్నారు. తద్వారా గర్భిణీలు నొప్పులనుంచి కొంత ఉపశమనం పొందుతారన్నారు. ప్రస్తుతం ఆ విధానం ప్రయోగాత్మకంగా ఆరు నెలలనుంచి హెబ్బాళ శాఖలో అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 13మందికి ఇటువంటి ప్రసవం చేశామన్నారు. ఇది పూర్తిగా నీటితొట్టితోనే సాధ్యం కాదని, సహజకాన్పుకు ఇదో విధానం మాత్రమే అన్నారు. యుకేలోని మాంచెస్టర్‌లో పదేళ్లపాటు పని చేశానని, అక్కడ సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఆ విధానం ఇక్కడా అమలు చేయాలన్నదే మా ఆశయమన్నారు. మూడు నెలల గర్భిణికి కాన్పు విషయమై కౌన్సెలింగ్ చేస్తామని, వారు ఆసక్తిచూపితేనే నీటితొట్టిలో ప్రసవానికి వీలు కల్పిస్తామన్నారు. మరో ఏడాది లో విస్తృత ప్రచారం ద్వారా సహజకాన్పులను పెంచి తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించదలిచామన్నారు.

పరిశోధనల కోసం విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలి

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలలో ప్రాధాన్యత కోసం విద్యార్థులు పాటుపడాలని డాక్టర్ విక్రమ్‌సారాభాయి సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ సోమనాథ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలోని బన్నేరుఘట్ట రోడ్డులోగల ఐఐఎంబీ 50వ స్నాతకోత్సవం జరిగింది. 798మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. 8మందికి బంగారు పతకాలను బహూకరించారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీతోపాటు వివిధ విభాగాలలో కోర్సులు చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. విద్యార్థులు ఉద్యోగాల వేటకంటే పరిశోధనలు ఆవిష్కరణలవైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఐఐఎం బెంగళూరు పాలనామండలి అధ్యక్షులు డాక్టర్ దేవిశెట్టి, డైరెక్టర్ రిషికేశ్ టీ కృష్ణన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో విద్యార్థులు

చిరునామా నెపంతో... అప్రమత్తం : ఎస్ఐ



ఎస్ఐ విఠల్ తళవార్‌కు సన్మానం

ముళబాగిలు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు చిరునామా నెపంతో ప్రత్యేకించి మహిళల గొలుసు చోరీలకు పాల్పడుతున్నారని అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ విఠల్ తళవార్ పిలుపునిచ్చారు. తాలూకాలోని యళగొండ్లహళ్ళి గ్రామ కూడలిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో బీట్ పోలీస్‌సభలో పాల్గొని మాట్లాడారు. యళగొండ్లహళ్ళి ప్రాంతం ముళబాగిలు, కోలారు, బంగారుపేట తాలూకాలకు అనుసంధానం కల్పించే మార్గంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పలువురిని ఏమార్చిన ఉదంతాలు చోటు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించి పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. కాగా క్రీడా పోటీల వేళ తలెత్తే సంఘర్షణలకు నియంత్రణ అవసరమని, యువత సంయమనం పాటించాలన్నారు. నేరాల నియంత్రణకు పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై మమతా మాట్లాడుతూ బాలికలు, స్త్రీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. దేవరాయసముద్ర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సువర్ణ నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు జమ్మనహళ్ళి కృష్ణప్ప, సభ్యుడు చిన్నప్పయ్య, దేవరాయసముద్ర కార్తిక్, పిచ్చగుంట్ల హళ్ళి జయప్ప, బీట్ పోలీస్ ఇన్‌చార్జ్ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.50కోట్లతో రోడ్ల అభివృద్ధి



భూమిపూజలో మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

విజయనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చామరాజపేట నియోజకవర్గంలోని మైసూరు రోడ్డులోని శిరసి సర్కిల్‌లో రూ.50కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులకు వసతి శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ శ్రీకారం చుట్టారు. శనివారం స్థానిక 7వ క్రాస్‌లో రహదారి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్, రాష్ట్ర మైనారిటీ అభివృద్ధి మండలి అధ్యక్షులు బీకే అల్తాఫ్‌ఖాన్, రాజు చంద్రశేఖర్, అమ్జాద్‌ఖాన్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

» తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్




మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు

బొమ్మనహళ్ళి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు ఎంపీ నియోజకవర్గాలకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ మాజీ మంత్రి, ఓబీసీ జాతీయ సంఘాల చీఫ్ అడ్వైజర్ శ్రీనివాస గౌడ్ అభిప్రాయపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1976లో 42వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ డీలిమిటేషన్ చేపట్టారన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరాది రాష్ట్రాలలో ఎక్కువ జనాభా ఉందని వల్ల అన్యాయం జరుగుతుందని పాతికేళ్ల వాయిదా వేశారన్నారు. 2021లోనూ వాజ్‌పేయ్ హయాంలోనూ ప్రస్తావనకు రాగా వాయిదా పడిందని, 2026లో మళ్లీ డీలిమిటేషన్ ప్రతిపాదన ఉందన్నారు. డీ లిమిటేషన్ వల్ల చట్టసభలలో సభ్యుల సంఖ్య తగ్గి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదకన కాకుండా సమానంగా అవకాశాలు కల్పించాలన్నారు. రెవెన్యూ ఉన్నప్పటికీ దక్షిణాదిరాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందన్నారు. 1971 జనాభా ప్రకారం లోక్‌సభ సభ్యులను సమానంగా విభజించాలన్నారు. కాగా 80 కోట్ల మంది ఉన్న ఓబీసీ వారికి కూడా న్యాయం జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ఓబీసీల కూడా రిజర్వేషన్ అవకాశాలు కల్పించాలన్నారు. మీడియా సమావేశంలో ద్వారకనాథ్ చొక్కా, భాస్కర్, లోహిత్‌నాయక్, కమలేశ్‌రావ్, మురళి, పునీత్, జగదీప్ తదితరులు పాల్గొన్నారు.

హుదుకుళలో కబ్జాలకు పాల్పడలేదు

» మీడియాకు ఎమ్మెల్యే వివరణ

బంగారపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హుదుకుళ గ్రామంలో తన కుమారుడు నిశాంత్ ఎలాంటి భూకబ్జాలకు పాల్పడలేదని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి వెల్లడించారు. పట్టణంలోని ఎస్ఎన్ రిసార్టులో శనివారం ఆయన మీడియాతో మాటాడుతూ హుదుకుళ గ్రామంలో సర్వే 267/3లో ఒక ఎకరా 21 గుంటల భూమి కొనుగోలు చేశారన్నారు. ఇతరులు తమ భూమిలో షెడ్‌లో నిర్మించేందుకు యత్నించిన వేళ నిశాంత్ చట్టపరంగా కొనసాగాడన్నారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. అయితే దీనిపై కొందరు తప్పుగా ప్రచారం చేశారని ఆరోపించారు. స్టే ఇవ్వడంతో భూమిలోకి అక్రమంగా ప్రవేశించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1592.82	1,581.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,380	844
నీటి నిల్వ (టీఎంసీలు)	13.55	4.98

1 నుంచి ఉపాధి కూలి రూ.370



● జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్ సుమైర్

బళ్లారి సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ పథకం కింద చెల్లించే ఉపాధి కూలిని ఏప్రిల్1 నుంచి రూ.370కి పెంచామని, వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల సంఖ్య పెరుగుదల కొనసాగుతుందని జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ సుమైర్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన మహాత్మాగాంధీ నరేగా పథకం కింద ప్రస్తుతం రూ.349 చెల్లిస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఆదేశం ప్రకారం కూలి రేట్లు పెంచామన్నారు. ప్రజలు వలస వెళ్లకుండా నిరోధించడానికి గ్రామాల్లో ఉపాధి పథకం ప్రవేశపెట్టారన్నారు. కూలీలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫారం-6 దరఖాస్తును అందజేసి ఉపాధి పొందవచ్చన్నారు. ఏడాదికి 100రోజుల పాటు నరేగా పనిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ పదవీ విరమణ పథకం కింద దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు నిర్ణీత రోజువారీ వేతనం సంపాదించడానికి అవసరమైన పని మొత్తంలో 50శాతం తగ్గింపు సౌకర్యం ఉంటుందన్నారు. 60శాతం కంటే ఎక్కువ మహిళా శ్రామిక శక్తి ఉన్న ప్రాజెక్టుల్లో, మహిళలు చేయాల్సిన పని మొత్తానికి 10శాతం తగ్గిస్తామన్నారు. నరేగా ప్రాజెక్టుల్లో 6నెలల వరకు పనిచేసే గర్భిణీ స్త్రీలకు బిడ్డ పుట్టే వరకు చేయాల్సిన పని మొత్తంలో 50శాతం తగ్గింపు , పాలిచ్చే తల్లులకు బిడ్డ పుట్టిన తేదీ నుంచి 6నెలల కాలానికి చేయాల్సిన పని మొత్తంలో 50శాతం తగ్గింపు ఇవ్వబడింది. ఆరోగ్య శాఖ జారీ చేసిన తల్లికార్డు ద్వారా డిస్కౌంట్ పొందవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజుఫోటోగ్రాఫ్, ఆదార్ కార్డు, రేషన్ కార్డు , బ్యాంక్ ఖాతా సమచారాన్ని సంబందిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేయాలన్నారు.



ఉపాధి పనుల్లో కూలీలు(ఫైల్)



నీటిని విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

గుడుదూర్ వాగులోకి నీటి విడుదల

బళ్లారి సిటీ,మార్చి 29(ఆంధ్రజ్యోతి): గుడుదూర్ వాగులోకి శనివారం నీరు విడుదల చేశారు. కంప్లి నియోజవర్గంలోని గుడుదూరు, హండిహాలు, డి.కగ్గల్, చానాల్ గ్రామాల గుండా సిరుగుప్ప అసెంబ్లీ నియోజకవర్గంలోని హెచ్‌హొసళ్లి, హగలూర్, దరూర్, కరూర్, గోసబాల, కరిగనూర్, బదుగుప్ప, మైలాపూర్ గ్రామాల గుండా ఎల్‌ఎల్‌సీ కాలువ నుండి 30 క్యూసెక్కుల నీరు చేరుతుంది. రైతులు పంపు సెట్లను ఉపయోగించి ఈ ప్రాంతంలో వరి పండిస్తారు. కాలువలో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కలెక్టర్ ఆదేశాల మేరకు నీరు విడుదల చేసినట్లు రైతులు తెలిపారు. వరి పంటలను కాపాడటానికి, పశువులకు త్రాగునీరు అందించడానికి నీరు వదిలినట్లు తుంగభద్ర రైతు సంఘ అధ్యక్షుడు దరూర్ పురుషోత్తమగౌడ తెలిపారు. వాగులోకి 3రోజుల పాటు 100క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే రైతు పంటలు ఆదా అవుతాయన్నారు.

అంజనాద్రి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

గంగావతి రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకాలోని చిక్కరాంపూర్ సమీపం అంజనాద్రి కొండపై ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ డబ్బులు లెక్కించారు. మార్చి 7నుంచి మార్చి 28వరకు రూ.10,04,130 వసూలు అయినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎం.హెచ్, ప్రకాశ్‌రావు నేతృత్వంలో హుండీ డబ్బు లెక్కింపు కార్యక్రమం జరిగింది. గత సంవత్సరం మార్చి7నాటికి రూ.28,35,647 సంగ్రహణ జరిగింది. హుండీ లెక్కింపులో సణాపూర గ్రామం కేజీబీ బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్ , గ్రామీణ స్టేషన్ ఏఎస్ఐ, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

పాలు, విద్యుత్ చార్జీల పెంపుపై ఎస్‌యూసీఐ నిరసన



నిరసనలో ఎస్‌యూసీఐ సభ్యులు

బళ్లారి సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పాలు, విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఎస్‌యూసీఐ శనివారం నగరంలోని రాయల్‌సర్కిల్లో నిరసన చేపట్టింది. ఈసందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో పాల ధరను లీటరుకు రూ. 4పెంచడంతో పాటు, విద్యుత్ చార్జీల ధరలను పెంచడాన్ని ఎస్‌యూసీఐ కమ్యూనిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతుల ఉత్పత్తి వ్యయం పెరిగిన మాట నిజమే అయినా, దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సారీ సామాన్య వినియోగదారులపైనే భారం మోపడం ప్రజా వ్యతిరేక విధానమని అన్నారు. జ్యోతి పథకం ఇది చాలా మంది వినియోగదారులకు సమస్య కాకపోవచ్చు, కానీ వాణిజ్య , చిన్న పరిశ్రమలకు భారం అవుతోందన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నులు వేస్తూ వేదనలకు గురి చేస్తున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీలు, రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు పేదలపై భారం మోపడం తగదన్నారు. ధరల పెంపు విధానానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు. ఎస్‌యూసీఐ సభ్యులు నాగరత్న మాట్లాడుతూ కెఎంఎఫ్, విద్యుత్ సంస్థల సామర్థ్యం పెంపుదల, లీకేజీలు, అవినీతి, దుబారా నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. జిల్లాకమిటీ సభ్యులు డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ గత లోక్ సభ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పై పోరాటానికి కాంగ్రెస్ పార్టీకి ధరల పెంపు కీలకమైన ఆయుధమనే విషయాన్ని మరిచిపోయినట్లు కనిపిస్తోందని, ఈపెంపుదలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుల శాంత, ఈశ్వరీ,నాయకులు విజయలక్ష్మి, రాజా, రవికిరణ్, హనుమప్ప, విద్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై చర్చ



మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త డాక్టర్ ప్రమోద్

బళ్లారి సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఎడ్యుకేషన్ సేఫ్ కమిటీ (ఏఐఎస్ఈసీ) ద్వారా ప్రభుత్వ పాఠశాలల విలీనంపై బీసీఎం పీజీ బాలుర హాస్టల్లో శనివారం పలు సంఘాల ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సామాజిక కార్యకర్త డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల సంఖ్య తక్కువగా ఉందని పేర్కొంటూ విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలు , సిబ్బందిని అందించడం, ప్రభుత్వ పాఠశాలలను కాపాడడం, అభివృద్ధి చేయకుండా మూసివేయడం తగదన్నారు. పాఠశాలలను మూసివేస్తే పేద విద్యార్థులు చదువుకు దూరమవు తారన్నారు. ప్రభుత్వ విద్య మనుగడ కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోరాడాలన్నారు. ఏఐఎస్ఈసీ జిల్లా కార్యదర్శి నాగరత్న మాట్లాడుతూ సమాజంలో కుసంస్కృతి, అశ్లీలత, క్రూరత్వం పెరిగిపోయాయన్నారు. అత్యాచారం, హత్య, దోపిడీ, కొట్లాటలు నేరాలు పెరుగుతున్నాయన్నారు. వీటన్నింటికీ ముగింపు పలకడానికి , విద్యార్థులు , యువత సరైన జ్ఞానాన్ని సంపాదించి పోరాటాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా సేవ్ ఎడ్యేకేషన్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు శశిధర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



ఆంజనేయస్వామి



నాగేంద్రుడు

కంప్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని పలు ఆలయాల్లో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం హంపి కోదండ రామ దేవస్థానం, అంజనాద్రి పర్వతం ఆంజనేయస్వామి, బుక్కసాగర వద్ద ఏళుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, (ఆంధ్రజ్యోతి) : పేటే ఆంజనేయస్వామికి అమావాస్య పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వాముల వారికి పుష్పాలంకార సేవలు, ఆకులపూజ, ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు దర్శనం కోసం బారులు తీరారు.

నేడు హనుమంతుడి రథోత్సవం



తోరణగల్లు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని తోరణగల్లు లో పసిద్ది చెందిన ఆంజనేయస్వామి రథోత్సవం శని వారం జరగనుంది. రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పెరిగిన ధరలతో మధ్యతరగతి విలవిల

● ప్రజలపై భారం మోపడమే కాంగ్రెస్ లక్ష్యం : బీజేపీ



ఆటల్ బిహారీ వాజ్‌పేయ్‌కి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ,మార్చి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వం పేదల వెన్ను విరిచేస్తోందని బీజేపీ జిల్లా నాయకులు ఎస్.రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాయంలో జరిగిన అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మశతాబ్ది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలధరలు, విద్యుత్ చార్జీలు పెంచేసి మధ్యతరగతి ప్రజలు విలవిలలాడుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని వీలైనంత త్వరగా కూలిస్తేనే ప్రజలు సుఖంగా ఉంటారన్నారు. ఈత ప్రభుత్వం హామీల పేరుతో ప్రజలను దోచుకుంటోందన్నారు. పెరిగిన ధరలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రూ.52కోట్ల హామీని కవర్ చేయడానికి ధరలను పెంచుతున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కానీ ఇప్పటి వరకు రూ.2.26లక్షల కోట్ల రుణం ఎందుకు తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో ఆటల్ బిరాసత్ కార్యక్రమం జరిగింది. వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేసీ నాయకులు నివాళులర్పించారు. కౌన్సిల్ సభ్యుడు వై.ఎం. సతీశ్, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. యత్నాళ్ బహిష్కరణ గురించి రవికుమార్ మాట్లాడుతూ పార్టీ ఒక నిర్ణయం తీసుకుందని, అందరమూ దానిని పాటించాల్సిందేనన్నారు. కార్యకర్తలుగా మేము జాతీయ నాయకులు తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉంటాము. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ప్రతిపక్ష పార్టీ నాయకులు దీనిపై మాట్లాడతారన్నారు.

పోలీసుల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్ఐ శశిధర్

బళ్లారిరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి రూరల్, బళ్లారి జిల్లా, సిరుగుప్ప తాలుకా అచ్చొళ్లి పోలీస్ స్టేషన్ పోలీసుల సహకారంతో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శశిధర్ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందువల్ల రోడ్డు మార్గాన వెళ్లే ప్రయాణికులకు, వాహనదారులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. క్రైమ్ సబ్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

20,246 మంది విద్యార్థుల హాజరు

విజయనగరం (హొస్పేట), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా శనివారం సోషల్ సబ్జెక్టుకు 20,246 హాజరయ్యారని డీడీపీఐ వెంకటేష్ రామచంద్రప్ప తెలిపారు. జిల్లాలో మొత్తం 71 పరీక్ష కేంద్రాలు వుండగా, హగరి బొమ్మనహళ్లిలోని 12 కేంద్రాలకు 3012 మంది విద్యార్థులు హాజరు కాగా, 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హొస్పేటలోని 20 కేంద్రాలకు 5,658 మంది విద్యార్థులు హాజరుకాగా 140 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొమ్మిది కేంద్రాల్లో జరిగిన ఫ్లవర్ బోట్ పరీక్షకు 2757 మంది విద్యార్థులు హాజరు కాగా, 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కూడ్లిగిలోని 17 కేంద్రాల్లో 4811 మంది విద్యార్థులు హాజరుకాగా, 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో పంచాయతీ అధ్యక్షుడు శివరాజ్

బళ్లారిరూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామంలో ఉగాదిపండుగ సందర్భంగా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా మొదలయ్యాయి. శనివారం పోటీలను గ్రామ పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీదేవి శివరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరాజు మాట్లాడుతూ కొత్త సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా యువకులు ఉత్సాహంగా ఉండాలని పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం జరుగుతందన్నారు. పోటీల్లో 18 టీమ్ లు పాల్గొంటున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. పది వేలు, రెండవ బహుమతి రూ. ఐదు వేలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖండ వాల్మీకి కర్ణాటక రాష్ట్ర ఉపాధ్యక్షులు జనార్దన్ నాయక్, శివరాజు, జానకి సుంకన్న, కురుబ బసవరాజు, పోలీసు లింగప్ప, ప్రభాకర్‌రెడ్డి, నాగేష్, గాదిలింగ, వన్నూరప్ప, జిరాక్స్ సురేష్, నాగరాజు, ఓబుళేసు, శబరి, పీడీ హళ్లి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

సైన్స్‌పార్క్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో సైన్స్‌పార్క్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రకాశ్ భూమిపూజ చేశారు. ముఖ్యమంత్రి పథకం కింద రూ.3.24కోట్లతో కార్పొరేషన్ పరిధిలోని 34వ వార్డు రామనాయకన్ చెరువు ప్రభుత్వ పార్కు కాంప్లెక్స్‌లో సైన్స్ పార్కు ఏర్పాటు కానుంది. కార్పొరేషన్ మేయర్ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్య, జోనల్ కమిటీ అధ్యక్షుడు రవి, నరేశ్, మాతేశ్, ద్రవిడకజగం వనవేందన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్

కేంద్రం తీరుపై డీఎంకే నిరసన

హోసూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకానికి తమిళనాడుకు రావాల్సిన రూ.4,034 కోట్లు ఇవ్వకుండా ఇబ్బంది కలిగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తీరును ఖండిస్తూ డీఎంకే ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా అన్ని యూనియన్లలో నిరసన కొనసాగింది. మద్దిగిరిలో ఏర్పాటైన నిరసనలో ఎమ్మెల్యే ప్రకాశ్ మాట్లాడుతూ త్రిభాషా విధానం ప్రకటిస్తేనే నిధులు విడుదల చేస్తామనడాన్ని ఖండించారు. తమ నాయకుడు ఎన్నిరెట్ల డబ్బులు ఇచ్చినా ద్విభాషా విధానం తప్ప త్రిభాషా విధానానికి ఆమోదించరన్నారు. నిరసనలో యూనియన్ కమిటీ మాజీ అధ్యక్షుడు సర్వేశ్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, డివిజన్ కార్యదర్శులు తిమ్మరాజ్, వెంకటేశ్, పంచాయతీ మాజీ అధ్యక్షులు రాము తదితరులు పాల్గొన్నారు. బాగలూరు బస్టాండ్ వద్ద జరిగిన నిరసనలో యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి నాయకత్వం వహించగా ప్రధాన కార్యవర్గ సభ్యుడు గిరీశ్ నిరసనను ఉద్దేశించి ప్రసంగించారు. బేరికై పోస్టాఫీస్ వద్ద జరిగిన నిరసనకు నాయకత్వం వహించారు. కీలక తీర్మాణాలు చేపట్టారు.

కిటకిటలాడిన పూలమార్కెట్

హోసూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా హోసూరు బస్టాండ్ ఎదురుగా ఉన్న పూలమార్కెట్‌లో రెండు రోజులుగా సందడి నెలకొంది. కనకాంబరం కిలో రూ.వెయ్యి, చేమంతి రూ.200, రోజా రూ.150 పలికింది. పండుగ నేపథ్యంలో అన్ని రకాల పూలకు మంచిధర పలకడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్‌కు చుట్టుపక్కల ప్రాంతాలైన బాగలూరు, అంచెట్టి, తళి, శూలగిరి, రాయకోట్టై, ఆనేకల్, సర్జాపుర, చందాపుర, తిరువణ్ణామలై, సేలం, వేలూరు తదితర జిల్లాల నుంచి మార్కెట్‌కు వచ్చాయి. పూలకు మంచి ధర పలకగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా కొనుగోలు చేశారు.



పూలమార్కెట్‌లో రద్దీ ఇలా..



కరపత్రాలు విడుదల చేస్తున్న ధర్మస్థల గ్రామీణాభివృద్ధి అధికారులు

నీటి ప్రాధాన్యంపై అవగాహన

కంప్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శ్రీ క్షేత్ర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సభ్యులు డాక్టర్ వీరేంద్ర హెగ్డే జల ఉత్సవాన్ని నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు నీటి ప్రాధాన్యం వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ మూగజీవులు దృష్టిలో వుంచుకుని ప్రతి రోజు ఇంటిపైకప్పుపై డబ్బాల్లో నీరు వుంచడం ద్వారా ప్రాణి పక్షులకు నీటి దాహం తీర్చిన వారమవుతామన్నారు. తాలుకా వ్యవసాయ అధికారులు సంజుకుమార్, తాలుకా ఇన్స్‌పెక్టర్ చెన్నమల్లయ్య, నాలెడ్జ్ అండ్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అధికారులు, రేఖ, సూపర్‌వైజర్లు రాజు, మంజుళ, మంజునాథ, ప్రభు, అనసూయ, జయలక్ష్మీ, రవిచంద్ర, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పై నిరసన

రాయచూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జిలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ(ఎంఎల్) లిబిరేషన్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. తాలూకా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 5 గ్యారెంటీలను అమలు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైయ్యాయని చెబుతూనే భారాన్ని సామాన్య ప్రజల పై మోపేందుకు చేస్తున్న ప్రయత్నం సిగ్గచేటన్నారు. ఇప్పటికే ఒకవైపు అధిక ధరలతో ప్రజల పై భారం ఉండగా విద్యుత్ చార్జిలను పెంచడం గర్హనీయమన్నారు. మరో వైపు ఉచిత విద్యుత్‌ను ఇస్తామంటు ప్రగల్బాలు చెబుతున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆచరణలో విద్యుత్ చార్జిల పెంపు, స్మార్ట్ మీటర్‌ల ఏర్పాటు వంటి నిర్ణయాలను తీసుకోవడం సమంజసం కాదన్నారు. వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.

వీధి కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బాలిక చైత్ర

రాయచూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తాలూకాలోని మర్చటాళ్ గ్రామంలో 9 ఏళ్ల బాలిక పై గుంపులుగా వచ్చిన వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాలిక గ్రామానికి చెందిన చైత్ర(9)గా గుర్తించారు. ఆరు బయట ఆడుకుంటున్న బాలిక పై ఒక్కసారిగా దాదాపు 12-13 కు పైగా ఉన్న వీధి కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేయడం కలకలం రేపింది. బాలికను శరీర భాగమంతా కాట్లు వేసి వీధి కుక్కలు చిందరమందరగా చేయడంతో పాటు చెవి దగ్గర వేసిన కాటుతో చెవి సగం వరకు తెగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. ఇరుగు-పొరుగు వారు కుక్కలను బెదిరించడంతో అవి వెళ్లగా బాలికను తీసుకుని వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాలిక పరిస్థితి క్లిష్టకరంగా ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా గ్రామంలో వీధి కుక్కల బెడద పెరిగిందని పలు సార్లు గ్రామ పంచాయతీ సభ్యుల దృష్టికి తెచ్చినా వాటి నివారణ కోసం ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని బాధిత కుటుంబస్థులతో పాటు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

1 నుంచి జూ పార్కు సందర్శనకు అనుమతి

విజయనగరం (హొస్పేట), మార్చి 29(ఆంధ్రజ్యోతి): హంపి జూ అటల్ బిహారీ వాజ్‌పేయి జులాజికల్ పార్క్ సందర్శనకు ఏప్రిల్ 1నుంచి పర్యాటకులకు అనుమతి స్తున్నట్లు డిప్యూటీ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ రాజేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం జూను మూసేస్తారు. ఉగాది, రంజాన్ పండుగలనాడు యథావిధిగా అనుమతిస్తామన్నారు.

వేసవిలో ప్రత్యేక తరగతులు తగదు

సిరుగుప్ప, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో హైస్కూలు విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నడపరాదని తాలూకా ప్రభుత్వ హైస్కూలు ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సురేష ప్రభుత్వాన్ని కోరారు. సిరుగుప్ప పట్టణంలో విద్యా శాఖాధికారి గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైస్కూలు విద్యార్థులకు వేసవికాలంలో మే నెల నుంచి ప్రత్యేక క్లాసులు చేయాలని ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదన్నారు. మేలో అధికంగా ఎండల కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడతారని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హైస్కూలు ఉపాధ్యాయుల సంఘం పదాధికారులు, సర్వ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.